

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్న దానానికి పశ్చిమ గోదావరి జిల్లా విస్సా కోడూరుకు చెందిన మీసాల రేణుకాస్వాతి కుటుంబం శనివారం రూ.1,01,116 సమర్పించింది.



వికసించిన మే పుష్పం
విస్సన్నపేట: అరుదైన మే పుష్పం కనువిందు చేస్తోంది. విస్సన్నపేట శ్రీనివాసనగర్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి పాతూరి శ్రీనాథరావు ఇంటి పెరటిలో ఈ పుష్పం వికసించింది.

గరిష్ఠం/కనిష్ఠం
38/28.9

	కనిష్ఠం	గరిష్ఠం
మచిలీపట్నం	29	31
గుడివాడ	29	31
నందిగామ	29.2	31.6
జగ్గయ్యపేట	28.9	38

న్యూస్‌రీల్

ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి



నందిగామ: ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని హెచ్చరించారు. పట్టణంలోని కేఎంఆర్ ఆస్పత్రిలో ఆమె శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను, రికార్డులు పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రతి ఆస్పత్రిలోనూ తప్పనిసరిగా సిజేరియన్ కాన్పుల విషయంలో యాజమాన్యం తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో వైద్యులు ఇందుమతి, నవీన్ పాల్గొన్నారు.

ప్రపంచ ఓషియానిక్ స్కేటింగ్ పోటీలకు జెస్సీరాజ్




విజయవాడస్పోర్ట్స్: న్యూజిల్యాండ్‌లో జరిగే ప్రపంచ ఓషియానిక్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే భారత జట్టులో విజయవాడ క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ చోటు దక్కించుకుంది. ఇటీవల జరిగిన భారత జట్టు ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన జెస్సీరాజ్‌ను ఈ పోటీలకు ఎంపిక చేసినట్లు రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఇండియా స్కేట్) ఇటీవల ప్రకటించింది. న్యూజిల్యాండ్ ఫెడరేషన్ ఆఫ్ రోలర్ స్పోర్ట్స్ ఆధ్వర్యాన జూన్ 13 నుంచి 17వ తేదీ వరకు ఆ దేశంలోని టీఎస్‌బీ స్టేడియంలో జరిగే పసిఫిక్ కప్ ఆర్టిస్టిక్ ఓపెన్ ఇన్విటేషనల్ కాంపిటీషన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో జెస్సీ పాల్గొననుంది. విజయవాడలోని ఎన్‌ఎస్‌ఎం స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న జెస్సీ 2021 నుంచి స్కేటింగ్ శిక్షణ తీసుకుంటోంది. జాతీయ పోటీల్లో ఒక గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్, రాష్ట్ర పోటీల్లో రెండు గోల్డ్, నాలుగు సిల్వర్, రెండు బ్రాంజ్, జిల్లా స్థాయి పోటీల్లో నాలుగు గోల్డ్, ఎనిమిది సిల్వర్ మెడల్స్ సాధించింది. వీటిలో పాటు స్కూల్ లెవల్ అథ్లెటిక్స్ పోటీల్లో 13, డాన్స్ పోటీల్లో ఒకటి, క్విజ్ పోటీల్లో రెండు, పేయింటింగ్ పోటీల్లో ఒక మెడల్ సాధించింది.

దుర్గమ్మ సేవలో చాగంటి కోటేశ్వరరావు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారికి ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఈఓ రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో పాటు శ్రీకనకదుర్గ వైభవం పుస్తకాన్ని అందజేశారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారితో పాటు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని చాగంటి కోటేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు.

బంగారు తాపడం పనులకు రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు బెంగళూరుకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. బెంగళూరుకు చెందిన గురువెల్లి వసంత కుమార్, పద్మ, ఇతర కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ.1,00,008 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

జీఎస్టీకి సర్జికల్ స్ట్రోక్

- జీరో వ్యాపారం చేస్తున్న అమరావతి సర్జికల్స్
- విచ్చలవిడిగా మత్తు మందుల విక్రయాలు
- గతంలో ఆకస్మిక దాడులు చేసిన జీఎస్టీ, డ్రగ్స్ అధికారులు
- రూ.60 లక్షల జరిమానా విధించిన వైనం
- మత్తు మందుల విక్రయాల లైసెన్స్ రద్దు
- అయినా తీరు మారని అమరావతి సర్జికల్స్ నిర్వాహకులు



విజయవాడలోని అమరావతి సర్జికల్స్ షోరూం

లబ్బీపేట(విజయవాడతూర్పు): 'ప్రభుత్వం నుంచి పొందిన లైసెన్సుల ముసుగులో వారు చేసేదంతా అక్రమ వ్యాపారమే. విక్రయాలకు సంబంధించి ఎలాంటి వాస్తవ రికార్డులూ ఉండవు. కొనుగోలుదారులకు సరైన బిల్లులు ఇవ్వరు. వారి నుంచి జీఎస్టీ వసూలు చేస్తారు. తాము ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీకి మాత్రం ఎగనామం పెడుతున్నారు.' ఇవీ అమరావతి సర్జికల్స్ నిర్వాహకులపై వెల్లువెత్తుతున్న విమర్శలు. విజయవాడ నగరం నడిబొడ్డున వ్యాపారం నిర్వహిస్తూ, ప్రతినెలా రూ.కోట్లలో విక్రయాలు సాగిస్తున్నా దానిలో కొంత మాత్రమే అధికారికంగా చూపెడుతున్నారన్న విమర్శలు సైతం ఉన్నాయి. అంతేకాదు చట్టవ్యతిరేకంగా మత్తు మందులు విక్రయాలు జరుపుతున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గతంఓ ఆ సంస్థపై అధికారులు గతంలో దాడులు నిర్వహించిన సమయంలో వెలుగు చూసిన అక్రమాలే నిదర్శనమని పేర్కొంటున్నారు.

గతంలో రూ.60 లక్షల జరిమానా

అమరావతి సర్జికల్స్‌లో అక్రమ వ్యాపారం జరుగుతోందన్న ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గతంలో జీఎస్టీ, ఔషధ నియంత్రణ మండలి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆ సమయంలో అమరావతి సర్జికల్స్ వ్యాపారంలో పెద్ద ఎత్తున అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. జీఎస్టీ చెల్లించకుండా ఎగనామం పెట్టినట్టు నిర్ధారించారు. దీంతో జీఎస్టీ అధికారులు వారికి రూ.60 లక్షల జరిమానా విధించారు. అంతేకాకుండా మత్తు మందుల విక్రయాల్లో సైతం లోపాలను ఔషధ నియంత్రణ మండలి అధికారులు గుర్తించారు. దీంతో మత్తు మందుల విక్రయాలకు సంబంధించిన లైసెన్సును ఔషధ నియంత్రణ మండలి అధికారులు రద్దు చేశారు.

అయినా ఆగని అక్రమాలు

జీఎస్టీ, ఔషధ నియంత్రణ మండలి అధికారులు అమరావతి సర్జికల్స్‌పై దాడులు నిర్వహించి జరిమానా విధించినా, మత్తు మందు విక్రయాలకు సంబంధించి లైసెన్స్ రద్దు చేసినా వారి అక్రమాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయని వైద్య రంగానికి చెందిన వారు ఆరోపిస్తున్నారు. అక్కడ సర్జికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లు జరిపిన వారెవరికీ జీఎస్టీ బిల్లులు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం రూ.లక్షల్లో విక్రయాలు చేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ ఎగనామం పెడుతున్నట్లు పేర్కొంటున్నారు. కొనుగోలుదారుడి నుంచి జీఎస్టీతో కలిపి బిల్లు వసూలు చేస్తూ, వారు మాత్రం ప్రభుత్వానికి చెల్లించడంలేదని, ఇలా రూ.లక్షల్లో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శిస్తున్నారు.

లైసెన్స్ రద్దు చేసినా..

గతంలో ఔషధ నియంత్రణ మండలి అధికారులు లైసెన్సు రద్దు చేసినా అమరావతి సర్జికల్స్ నిర్వాహకులు మత్తు మందుల విక్రయాలు యథేచ్ఛగా జరుపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడి నుంచే విక్రయాలు జరుపుతూ, మరొక ఏజెన్సీ పేరుతో బిల్లులు ఇస్తున్నారని వైద్య రంగంవారి పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై ఔషధ నియంత్రణ మండలి అధికారులు దృష్టి సారిస్తే అనేక అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందంటున్నారు. వారి వద్ద ఉన్న స్టాక్‌కు సంబంధించి సరైన రికార్డులు ఉన్నాయా? సక్రమంగా జరిపే విక్రయాలెన్ని? అక్రమంగా జరిపేవి ఎన్ని? వాటి నాణ్యత ఏమిటి? అన్న అంశాలపై అధికారులు దృష్టి పెడితే అనేక లోపాలు వెలుగు చూస్తాయని తేల్చిచెబుతున్నారు.

కౌంటింగ్‌కు కసరత్తు

- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా అధికార యంత్రాంగం
- పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు
- విధుల్లో 1,156 మంది సిబ్బంది
- ఇప్పటికే వివిధ శాఖల అధికారులకు శిక్షణ



కౌంటింగ్ ప్రక్రియపై అధికారులకు శిక్షణ ఇస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ (ఫైల్)

సాక్షి, మచిలీపట్నం:కృష్ణా జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో ఓటు ద్వారా ప్రజలు ఇచ్చిన తీర్పు జూన్ 4వ తేదీన వెలువడనుంది. పోలింగ్ తరువాత నేతల భవితవ్యం స్ట్రాంగ్ రూముల్లో భద్రంగా ఉంచిన అధికారులు.. చివరి అంకానికి సంసిద్ధం అవుతున్నారు. అభ్యర్థుల తల రాతలు వెల్లడించేందుకు కసరత్తు చేపట్టారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మచిలీపట్నం పార్లమెంట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాలకు పోలింగ్ రోజున వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ఇప్పటికే జిల్లా కేంద్రంలోని కృష్ణా యూనివర్సిటీలో ఉంచారు. మూడంచెల భద్రత నడుమ స్ట్రాంగ్ రూంలో ఉంచి, పటిష్ట నిఘా మధ్య పోలీసుల కాపు కాస్తున్నారు. అయితే కౌంటింగ్ ఏర్పాట్లపై దృష్టి పెట్టిన జిల్లా అధికారులు ఇప్పటికే వివిధ శాఖలను సమన్వయం చేశారు. కౌంటింగ్‌కు కావాల్సిన సిబ్బందిని విధులకు సమాయత్తం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా కేటాయింపు

కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దృష్టి పెట్టిన అధికారులు సుమారు 1,156 మందిని లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనేలా చూస్తున్నారు. ఏడు నియోజకవర్గాల్లో సుమారు 12.93 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఓట్లను లెక్కించేందుకు ఇప్పటికే వివిధ శాఖల అధికారులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల వారిగా టేబుళ్లపై అవగాహన కల్పించారు. వీరితో పాటు మరి కొంత మంది తీసుకొని విభాగాలు, నియోజకవర్గాల వారీగా కేటాయించే పనిలో ఉన్నారు.

విడతల వారీగా..

ఓట్ల లెక్కింపులో 1,156 మందికి బాధ్యతలు అప్పగించనున్నారు. వీరిలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 349 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 443, మైక్రో అబ్జర్వర్లు 364 ఉన్నారు. వీరికి ఈ నెల 27వ నుంచి విడతల వారీగా, వేళల వారీగా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర, లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు.

అందరూ సహకరించాలి

జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపును సజావుగా, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపడతాం. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఇప్పటికే ప్రజలు వినియోగించుకున్నారు. ఫలితాలు కౌంటింగ్ రోజున వెలువడనున్నాయి. ప్రజా తీర్పును అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గౌరవించాలి. ప్రశాంతంగా కౌంటింగ్‌ను పూర్తి చేసేందుకు సహకరించాలి.

– దీకే బాలాజీ, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, కృష్ణా జిల్లా

బంతి బంతికీ బెట్టింగ్..!



- ఐపీఎల్ మ్యాచ్‌లపై కృష్ణా జిల్లాలో జోరుగా పందేలు
- బుకీలతోపాటు ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ల నిర్వహణ
- అందుబాటులోకి ప్రత్యేక యాప్‌లు
- బెట్టింగ్ ఉచ్చులో వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు
- క్షణాల్లో రూ.కోట్లలో నష్టపోతున్న వైనం
- నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌పై జిల్లాలో భారీగా బెట్టింగ్ జరిగే అవకాశం

సాక్షి, మచిలీపట్నం: ఐపీఎల్... ఫ్రాంచైజీలు, క్రికెటర్లు, యాడ్స్ సంస్థలతోపాటు బెట్టింగ్ నిర్వాహకులకు కూడా కాసుల వర్షం కురిపిస్తోంది. ఆఫ్‌లైన్‌లో నేరుగా బుకీలతోపాటు ఆన్‌లైన్‌లో కూడా బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి తీసుకొచ్చి పెద్ద ఎత్తున పందేలు నిర్వహిస్తున్నారు. టాస్ ఎవరు గెలుస్తారు... మొదటి ఓవర్‌లో వికెట్ పడుతుందా.. తొలి ఓవర్‌లో ఎన్ని ఫోర్లు కొడతారు.. ఇలా బంతి బంతికీ బెట్టింగ్‌లు కడుతున్నారు. క్షణాల్లో కోట్ల రూపాయలు చేతులు మారిపోతున్నట్లు సమచారం. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో కృష్ణా జిల్లాలో పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలిసింది. మచిలీపట్నానికి చెందిన ఓ ప్రముఖ బుకీపై గతంలో పోలీసులు పీడీ యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. దీంతో పోలీసుల నిఘా, బెట్టింగ్ స్థావరాలపై దాడులు, అరెస్టులు, కేసుల భయంతో బుకీలు కొత్తగా ఆన్‌లైన్ మార్గాన్ని ఎంచుకుని దందా నిర్వహిస్తున్నారు. బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లను ఏర్పాటుచేసుకుని ఎక్కడివారు అక్కడే ఉండి పందేలు కాసేలా చేస్తున్నారు. జిల్లాలో మచిలీపట్నం, గన్నవరం, గుడివాడ, పెనమలూరు, పామర్రు ప్రాంతాల్లో ఈ బెట్టింగ్ దందా భారీగా నడుస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

సెల్ ఫోన్ ఉంటే చాలు...

బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి రావడంతో చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడే అవకాశం ఉంది. పందేలు కాసేవారు ముందుగా తాము ఎంపిక చేసుకున్న యాప్‌లోకి ప్రత్యేక యూసర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ కావాలి. మ్యాచ్‌కు గంట ముందే కొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాలి. మ్యాచ్‌కు ముందు రేటింగ్స్ ఇస్తారు. వాటి ప్రకారం డిపాజిట్‌లోని కొంత మొత్తాన్ని బెట్టింగ్ కాయొచ్చు. మ్యాచ్ సాగేతీరును బట్టి రేటింగ్స్ మారుతుంటాయి. అప్పుడు కూడా డిపాజిట్‌లో మిగిలిన మొత్తాన్ని మాత్రమే వాడాలి. డిపాజిట్ అయిపోతే అప్పటికప్పుడు డిపాజిట్ చేసి బెట్టింగ్ కాసే అవకాశం ఉండదు. దీంతో చాలామంది రూ.50వేల నుంచి లక్షల రూపాయలు ముందుగానే యాప్స్‌లో డిపాజిట్ చేస్తున్నట్లు సమాచారం. మ్యాచ్ పరిస్థితి, రేటింగ్స్‌ను బట్టి అప్పటికప్పుడు ఆకర్షితులై భారీగా బెట్టింగ్ కాస్తున్నారు. బెట్టింగ్‌లో గెలిస్తే క్షణాల్లో డబ్బు ఖాతాల్లో జమ అవుతుంది. ఓడిపోతే ఖాతాలో సొమ్ము ఖాళీ అవుతుంది. ఈ సీజన్‌లో ఐపీఎల్ ప్రతి మ్యాచ్ హోరాహోరీగా సాగడం, గెలుస్తుందనుకునే జట్టు ఓడిపోవడంతో బెట్టింగ్‌రాయుళ్ల అంచనాలు తలకిందులవుతున్నాయి. వారి ఖాతాల్లోని డబ్బు క్షణాల్లో అవిరవుతోందని తెలుస్తోంది. కృష్ణా జిల్లాలో విచ్చలవిడిగా బెట్టింగ్ సాగుతుండడంతో ఈ సీజన్‌లో రూ.కోట్లలో దందా జరుగుతుందని అంచనా.

ఉచ్చులో వ్యాపార, ఉద్యోగ, విద్యార్థులు

కొందరికి కాసుల వర్షం కురిపిస్తున్న ఐపీఎల్ ఎంతోమందికి కన్నీరు తెప్పిస్తోంది. ఈ బెట్టింగ్ ఉచ్చులో జిల్లాలోని ప్రముఖ వ్యాపారులు, ఉద్యోగులతోపాటు విద్యార్థులు కూడా చిక్కుకుని తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో కాసేవారు సెల్‌ఫోన్లు దగ్గర పెట్టుకుని తమ పని పూర్తిచేస్తున్నారు. ఆఫ్‌లైన్‌లో నిర్వాహకులు మాత్రం బార్ అండ్ రెస్టారెంట్లు, కొన్ని లాడ్జీల్లో తిష్టవేసి బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో గెలుపొందిన కోల్‌కతా ఫైనల్‌లో బెర్త్ ఖరారు చేసుకుంది. ఓటమి పొందిన సన్ రైజర్స్.. రాజస్థాన్ రాయల్స్‌తో శుక్రవారం రాత్రి తలపడింది. ఉత్కంఠంగా సాగిన ఈ క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 175 చేసింది. రెండో బ్యాటింగ్ దిగిన రాజస్థాన్ 20 ఓవర్లతో 139 పరుగులు చేసి ఓటమి పొందింది. హోరాహోరీగా సాగిన ఈ ఆటలో బెట్టింగ్ రాయుళ్లు భారీగా పందాలు కాశారు. ఓవర్‌లో ఎన్ని పరుగులు వస్తాయి? ఓవర్‌లో సిక్స్ వస్తుందా? లేదా? వేసే బాల్‌కు రన్ వస్తుందా? డాట్ బాల్ అవుతుందా? వికెట్ పడుతుందా? ఇందులో గెలిచి, ఫైనల్‌లో కేకేఆర్‌తో తలబడే టీం ఏది?...ఇలా ప్రతీ బాల్‌కూ బెట్టింగ్ కాసినట్లు తెలుస్తోంది.

మీ పిల్లల ఫోన్లలో ఈ యాప్‌లు ఉంటే జాగ్రత్త

ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం ఎక్కువ మంది డఫా బెట్టింగ్ యాప్‌ను వినియోగిస్తున్నారని తెలుస్తోంది. బెట్ వే, బెట్ 365, మెల్‌బెట్, పారిమ్యాచ్, రాజా బెట్స్, 22 బెట్‌తోపాటు మరో 30 యాప్స్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. పిల్లల సెల్‌ఫోన్లలో ఈ యాప్‌లు ఉంటే వెంటనే తల్లిదండ్రులు వాటిని తొలగించి బెట్టింగ్‌కు దూరంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే బెట్టింగ్ బారిన పడి విద్యార్థులు, యువత తమ ప్రాణాలను సైతం కోల్పోయే ప్రమాదం ఉంది.

ఫైనల్‌పైనా బెట్టింగ్స్....

క్వాలిఫయర్ ఆటలో గెలిచిన సన్‌రైజర్స్ ఆదివారం జరిగే తుది పోరులో కోల్‌కతాతో తలపడనుంది. ఫైనల్ మ్యాచ్‌లో ఆడే ఆటగాళ్లతో పాటు ఎవరు ఎన్ని పరుగులు చేస్తారు? ఏ బౌలర్ ఎన్ని వికెట్లు తీస్తాడు? ఫైనల్ మ్యాచ్‌లో కప్పు గెలిచి, విజేతగా ఏ టీం నిలుస్తుందని బెట్టింగ్‌కు శనివారం నుంచే ప్రారంభించారు.

ప్రశాంతంగా డెప్యూటీ డీఈవో పోస్టుల భర్తీ పరీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం):పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో డెప్యూటీ ఎడ్యుకేషన్ అధికారుల పోస్టుల భర్తీ కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 2,370 మంది అభ్యర్థులు రాసిన ఈ ఆన్‌లైన్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1434 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 936 మంది గైర్హాజరయ్యారని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు తెలిపారు.

29న పొంగలి షెడ్డు నిర్వహణ హక్కుల వేలం

జగ్గయ్యపేటఅర్బన్: మండలంలోని వేదాద్రి గ్రామంలో వేంచేసిన శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ఒక సంవత్సరం కాలపరిమితికి షామియానా పొంగలి షెడ్డు నిర్వహించే హక్కుల కోసం ఈ నెల 29వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.హేమలతాదేవి శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు ఆధ్వర్యంలో దేవదాయశాఖ అధికారుల సమక్షంలో ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగుతాయని వివరించారు. వేలంలో పాల్గొనేవారు లక్ష రూపాయలను ధర్జువతుగా చెల్లించాలని శ్రీయోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం ఈఓ హేమలతాదేవి తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

రైతుల్లో రెమాల్ గుబులు

- కుండపోత వర్షంతో జనం అవస్థ
- పల్లపు ప్రాంతాల్లో నిలిచిన వర్షపునీరు
- మొక్కజొన్న రైతుల్లో ఆందోళన

కంకిపాడు: రైతుల్లో రెమాల్ తుపాను గుబులు రేపుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారటంతో జిల్లా అంతటా శనివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఈదురుగాలులు తోడయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. తెల్లవారుజాము నుంచే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతో ప్రారంభమైన వాన భారీ వర్షంగా మారింది. విజయవాడ-మచిలీపట్నం రోడ్డు సైతం వర్షంనీటితో నిండి ప్రవహించటం, డ్రెయినేజీ మురుగు కలవటంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థ పడాల్సి వచ్చింది. వర్షం తగ్గుముఖం పట్టాక వర్షపునీరు డ్రెయినేజీల్లోకి పారటంతో జనం ఊరట చెందారు. భారీ వర్షంతో మొక్కజొన్న, కూరగాయల రైతుల్లో కలవరం మొదలైంది. జిల్లా వ్యాప్తంగా 10958 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట కోయించి, మొక్కజొన్నను మిల్లులు, ఫౌల్ట్రీ ఫామ్స్‌కు తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. బయటి మార్కెట్‌లో ఆశించిన ధర ఉండటంతో రైతులు మొక్కజొన్నను కల్లాలు, రోడ్డు మార్జిన్‌లలో ఎండబెట్టి ఉంచారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి పంట ఎక్కడ నాణ్యత దెబ్బతింటుందోనన్న భయం మొక్కజొన్న రైతుల్లో నెలకొంది. ఆరబోసిన మొక్కజొన్నను వర్షం బారిన పడకుండా టార్పాలిన్‌లు, పరదాలు కప్పి సంరక్షించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. 6042 ఎకరాల్లో కూరగాయలు సాగు జరిగింది. వర్షంతో తీగజాతి పంటలతో పాటుగా మిర్చి, వంగ, ఇతర పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. మరో మూడు రోజులు తుపాను ప్రభావం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.



భారీ వర్షంతో చెరువును తలపిస్తున్న కంకిపాడు బస్టాండు ప్రాంగణం

జిల్లాలో పలుచోట్ల వర్షం

అవనిగడ్డ: కృష్ణాజిల్లాలో శనివారం పలుచోట్ల పడింది. అవనిగడ్డ, ఘంటసాలలో అత్యధికంగా 9.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, నాగాయలంకలో 8.4 మి.మీ, మోపిదేవి, పమిడిముక్కలలో 4, చల్లపల్లి 3, కోడూరు, పెనమలూరులో 1.2, కంకిపాడు 0.8, ఉయ్యూరులో అత్యల్పంగా 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 41.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా, సగటున 1.7మి.మీ వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

ట్రెవీస్ దాతకు సత్కారం

ఎలకుర్రు(పామర్రు): మండలంలోని ఎలకుర్రు గ్రామంలో పాల సేకరణ కేంద్రాన్ని శనివారం విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సందర్శించారు. అనంతరం గ్రామంలో పాల కేంద్రం వద్ద పశువుల వైద్యసేవల నిమిత్తం నిర్మించిన ట్రెవీస్‌ను నిర్మించిన దాతను సత్కరించారు. కార్యక్రమంలో పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు కె.ఉమా మహేశ్వరరావు, ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బి.కృష్ణారెడ్డి, పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ సీహెచ్‌డీకే గోపీనాథ్, పాల ఉత్పత్తిదారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

లంకపల్లి(ఘంటసాల): విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన ఘంటసాల మండలం లంకపల్లి ఎస్సీకాలనీలో జరిగింది. ఘంటసాల పోలీసులు అందించిన వివరాల మేరకు ఘంటసాల మండలం లంకపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఉడుముల సామేలు (48) వైఎస్సార్ కాలనీలో నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇల్లు తడుపుతుండగా మోటర్ పైపు మెలికిపడటంతో మెలిక తీస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే చల్లపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు సామేలు మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.



సాగరతీరంలో ముందుకు చొచ్చుకువస్తున్న సముద్రనీరు

సాగరతీరం..అల్లకల్లోలం

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారడంతో హంసలదీవి సాగర తీరం అల్లకల్లోలంగా మారింది. శనివారం ఉదయం నుంచి పాలకాయతిప్ప బీచ్ వద్ద సముద్ర అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరం భీకరంగా మారింది. సముద్ర నీరు ముందుకు చొచ్చుకువచ్చింది. పౌర్ణమి పోటు కూడా తోడవడంతో నీరు మడ చెట్ల గుండా కరకట్టను తాకింది. అలల ఉధృతికి తీరంలోని ఇసుకతిన్నెలు భారీగా కోతకు గురయ్యాయి. సాగరసంగమం వద్ద కోత అధికంగా కనిపిస్తోంది. పరిస్థితులు ప్రమాదకరంగా ఉండటంతో పర్యాటకులు సముద్రంలో స్నానాలు చేయకుండానే వెనుదిరిగారు.



కరకట్ట వరకు చొచ్చుకువచ్చిన సముద్రనీరు

బస్సులో పోగొట్టుకున్న నగదు, నగలు అప్పగింత

అవనిగడ్డ: ఆర్టీసీ బస్సుల్లో నగదు కవర్, బంగారు గొలుసు పోగొట్టుకున్న ఘటనల్లో తిరిగి ప్రయాణికులకు అప్పగించిన ఘటనలు శనివారం జరిగాయి. ఆర్టీసీ డీఎం హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం బొప్పిడి అనసూయ చల్లపల్లిలో ఆర్టీసీ బస్ ఎక్కి మోపిదేవిలో దిగింది. బస్సులో పర్స్ మర్చిపోయింది. అవనిగడ్డ ఆర్టీసీ కార్యాలయానికి వచ్చి విషయం చెప్పింది. కండక్టర్ పి.శ్రీనివాసరావు బస్సు లోపల వెతికి సీటు కింద రూ.55 వేలు నగదు ఉన్న కవర్‌ను గుర్తించగా, ఆ కవర్‌ని డీఎం హనుమంతరావు ప్రయాణికురాలికి అప్పగించారు. మరో ఘటనలో పెడనకు చెందిన పొన్నూరు అన్నపూర్ణమ్మ మచిలీపట్నంలో బస్ ఎక్కింది. అవనిగడ్డలో దిగేటప్పుడు చూడగా గొలుసు కనబడకపోవడంతో కండక్టర్ మస్తానమ్మకు చెప్పారు. ఓ ప్రయాణికునికి ఆ గొలుసు దొరకగా ఆయన దానిని కండక్టర్‌కు అప్పగించారు. డీఎం హనుమంతరావు ద్వారా బంగారు గొలుసుని పోగొట్టుకున్న మహిళకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు కండక్టర్లను డీఎం అభినందించారు.



ప్రయాణికురాలికి నగదు అప్పగిస్తున్న ఆర్టీసీ డీఎం


అక్రమ మద్యం పట్టివేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): హర్యానా రాష్ట్రం నుంచి అక్రమంగా తీసుకు వచ్చిన 64 ఫుల్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కేవీఆర్‌కే ప్రసాద్ తెలిపారు. నగరంలోని భానునగర్ బీఆర్‌టీఎస్ రోడ్డులో అక్రమ మద్యం సమాచారం రాగా, తమ సిబ్బంది వెళ్లి తనిఖీలు చేశారన్నారు. ఆ తనిఖీల్లో హర్యానా నుంచి తీసుకు వచ్చిన 64 సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితులు కుంచాడ మోహనరావు, మహంకాళి మురళిను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో వెస్ట్ ఎస్ఈబీ స్టేషన్ సీఐ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎం.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదడు వాపు..అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకం

- ఇన్‌ఫెక్షన్, శరీరంలో యాంటీబాడీలు పెరగడమే కారణం
- తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చు
- పెరుగుతున్న మెదడువాపు వ్యాధి రోగులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్న వైనం



లబ్బీపేట(విజయవాడతూర్పు): మానవ శరీరంలో అతి ముఖ్యమైనది మెదడు. దాని పనితీరు బాగుంటేనే ఎవరైనా చురుగ్గా పనిచేయగలుగుతారు. ఇటీవల కాలంలో పలు రకాల ఎన్‌సెఫలైటిస్(మెదడువాపు వ్యాధి)లతో రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. అలా వస్తున్న వారిలో ఆటోఇమ్యూన్ ఎన్‌సెఫలైటిస్, హెర్పిస్ ఎన్‌సెఫలైటీస్, జపనీస్ ఎన్‌సెఫలైటిస్‌లతో పాటు, రెసిస్టెన్స్ ఎపిలెప్సీ, అటాక్సియా వంటి సమస్యలతో వస్తున్నారు. వీరిలో ఎక్కువగా పరిస్థితి విషమించిన తర్వాతే వస్తున్నట్లు వైద్యులు చెపుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు నెలలో 20 నుంచి 30 మంది వరకూ ఈ సమస్యలతో వస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయని, సకాలంలో ఆస్పత్రిలో చేరితే ప్రాణాపాయం లేకుండా చూడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల సోకుతున్న ఎన్‌సెఫలైటిస్‌లు, వాటి లక్షణాలు, చికిత్సల గురించి తెలుసుకుందాం..

ఆటోఇమ్యూన్ ఎన్‌సెఫలైటిస్..

శరీరంలోని యాంటీబాడీస్ ఒక్కోసారి కండరాలతో పాటు మెదడుపై ప్రభావం చూపుతాయి. దీంతో ఫిట్స్ రావడం, స్పృహ కోల్పోవడం జరుగుతుంది. ఎక్కువగా వైరల్ ఇన్‌ఫెక్షన్స్ సోకిన వారిలో కొన్ని రకాల క్యాన్సర్‌లు ఉన్న వారు, రుమటాయిడ్ ఆర్థరైటిస్, పలు రకాల కీళ్లవాతం సమస్యలు, ఫ్లూ వ్యాక్సిన్ వేయించుకున్న వారికి ఆటోఇమ్యూన్ ఎన్‌సెఫలైటిస్ రావచ్చు. ఇది సోకిన వారికి మొదటి స్టెరాయిడ్స్, ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్స్‌తో పాటు, అవసరమైతే డయాలసిస్ చేసి యాంటీబాడీస్‌ను అదుపు చేస్తారు. ప్రస్తుతం ఈ వ్యాధికి మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

తొలిదశలో గుర్తిస్తే నయం చేయవచ్చు



మెదడు వాపు వ్యాధులకు సంబంధించి లక్షణాలను తొలిదశలో గుర్తించడం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు. ప్రస్తుతం మంచి మందులు అందుబాటులోకి వచ్చాయి. బ్రెయిన్‌లో ప్రెజర్ పెరిగి ఫిట్స్ రావడం, మాట కోల్పోవడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ డి.అనిల్‌కుమార్, న్యూరాలజిస్ట్, విజయవాడ

హెర్పిస్ ఎన్‌సెఫలైటీస్

ఇది తీవ్రమైన మెదడువాపు వ్యాధి. ఇది పిల్లలు, పెద్దలు ఎవరికైనా రావచ్చు. హెర్పిస్ వైరస్ కారణంగా ఈ జబ్బు సోకుతుంది. ఇది సోకిన వారు తీవ్రమైన జ్వరంతో ప్రారంభమై, ఫిట్స్ రావడం, 24 గంటల్లోనే స్పృహ కోల్పోతారు. దీనిని వెంటనే గుర్తిస్తే నయం చేసేందుకు మంచి మందులు అందుబాటులో ఉన్నట్లు వైద్యులు చెపుతున్నారు. వ్యాధి సోకితే కోలుకోవడానికి వారం నుంచి పదిరోజుల వరకూ సమయం పడుతుంది. తొలిదశలో గుర్తించక పోతే ప్రాణాపాయం కూడా కావచ్చు.

రెసిస్టెన్స్ ఎపిలెప్సీ

సరిగా మందులు వాడని ఫిట్స్ రోగులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన వారికి మెదడు మొద్దుబారి పోవడంతో మందులు సరిగా పనిచేయక ఫిట్స్ వెంట వెంటనే వచ్చేస్తుంటాయి. మందులు వేసినా పనిచేయని పరిస్థితి తలెత్తుతుంది. స్పృహ కూడా కోల్పోవచ్చు. ఇలాంటి వారికి ఎక్కువ సమయం పనిచేసే మందులు ఇవ్వడంతో పాటు, బ్రెయిన్ స్కాన్ చేసి, మెదడు ఎంతవరకూ డ్యామేజీ అయిందో నిర్ధారిస్తారు. అవసరమైతే శస్త్ర చికిత్స కూడా అవసరం అవుతుంది. అందువలన ఫిట్స్ ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వాడటం మంచిది.

అటాక్సియా

ఇది సోకిన వారు నడిచేటప్పుడు, నిల్చున్నప్పుడు బ్యాలెన్స్ తప్పుతుంటారు. నడవడం కష్టంగా మారుతుంది. పిల్లలు, పెద్దవారిలో ఎవరికైనా రావచ్చు. కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్స్, జన్యులోపం, క్రోమోజోముల్లో తేడాలతో ఈ వ్యాధి సోకుతుంది. కొందరిలో పుట్టుకతోనే ఈ రకమైన జన్యుపరమైన లోపం ఉంటుంది. దీనిని గుర్తించి చికిత్స పొందితే నయం చేయవచ్చు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య



గూడూరు: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఐదుగుళ్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోయి కృష్ణకిషోర్(36) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. చిన్నతనంలోనే తండ్రి సుబ్రహ్మణ్యం చనిపోవడంతో తల్లితో పాటు ఉంటున్నాడు. కొంత కాలంగా ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న కృష్ణకిషోర్, ఆ కారణంగానే తనకు వివాహం కావడం లేదన్న మనస్తాపంతో ఈనెల 19న గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బందరు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడకు తరలించారు. అప్పటి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణకిషోర్ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. గూడూరు ఏఎస్ఐ ఆర్.పి.స్వాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా సహకరించండి

జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేలా అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. శనివారం సాయంత్రం ఆయన తన చాంబర్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లతో లెక్కింపు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు ధన్యవాదాలు తెలిపారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ఈ కార్యక్రమంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని, అనంతరం ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లో ఈవీఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఏమైనా ఓట్లు చెల్లుబాటు కాకపోతే తిరస్కరిస్తూ విడిగా పెట్టెలో ఉంచుతామన్నారు. 14 టేబుళ్లు ఏర్పాటుచేస్తున్నామని, ప్రతి టేబుల్‌కు అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. రిటర్నింగ్ అధికారి వద్ద ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులు ఓట్ల లెక్కింపు కేంద్రానికి జూన్ 4న ఉదయం 7 గంటలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం వచ్చే రాజకీయ పార్టీల నాయకులు, ఏజెంట్లు వారి వాహనాల కోసం ముందస్తుగా అనుమతి పత్రాలు పొందాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఏజెంట్లను కౌంటింగ్ హాలు నుంచి బయటకు పంపేందుకు రిటర్నింగ్ అధికారికి సర్వహక్కులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె. చంద్రశేఖరరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షేక్ షాహెద్‌బాబు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దుర్గాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ

